క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వర్ని: మండల కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. బైక్‌లు, కార్లు, గూడ్స్ వాహనాలను తనిఖీ చేసి, రోడ్డు భద్రత నిబంధనలు పాటించని వారికి, వాహనాల ధ్రువపత్రాలు లేనివారికి జరిమానా విధించినట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి వెల్లడించారు. అలాగే ఇదివరకు జరిమానా విధించబడి చెల్లించని వాహనదారుల నుంచి పాత బకాయిలను మీసేవలో చెల్లించే విధంగా చైతన్యపరిచినట్లు ఆయన తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం



బాల్కొండ: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, అధికారంలోకి వస్తుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాడానికి అన్ని అర్హతలున్నాయన్నారు. మండల అధ్యక్షుడు అంబటీ నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగుల పల్లి రాజేశ్వర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన విద్యార్థినులు ఆల్ ఇండియా కరాటే పోటీల్లో సత్తాచాటారు. ఈనెల 26, 27, 28 తేదీలలో గోవాలో జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ 2023 పోటీల్లో పాల్గొన్న లతిక అండర్ 16 విభాగంలో కాంస్య పతకం, శ్రీనిధి అండర్ 12 విభాగంలో కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఇద్దరు విద్యార్థులను సోమవారం గ్రామస్తులు అభినందించారు. జవాన్ కరాటే ఫెడరేషన్ సంస్థ వ్యవస్థాపకులు సెన్సాయి ఎంఎస్ పాషా చేతుల మీదుగా పతకాలను అందించినట్లు ఇన్‌స్ట్రక్టర్ అవినాష్ తెలిపారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



ఆర్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చాయని, ఎన్నికల సమయంలో వారు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు డిమాండ్ చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో సోమవారం సీపీఎం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్, నల్ల ధనాన్ని వెలికితీసి పేదలకు పంచి పెడతానని హామీలు గుప్పించి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వచ్చే నెల 2న ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంలో సీపీఎం బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈమేరకు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు మాల శ్రీకాంత్, రహీం, శ్రీనివాస్, నదీం, పరుశురామ్ తదితరులున్నారు.

కంటి శిబిరం ప్రారంభం



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని కోమట్‌పల్లిలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ నాగరాజు ప్రారంభించారు. ఐదు రోజులపాటు శిబిరం కొనసాగుతుందని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నరేందర్, వైద్యులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

- బోధన్ నియోజకవర్గంలో ప్రారంభమైన వ్యవసాయ పనులు
- దుక్కులు దున్నడం, వరి నార్లు పోయడంపై దృష్టిసారించిన రైతులు
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు



లంగ్డాపూర్ శివారులో రైతులు సిద్ధం చేస్తున్న వరి నారు

బోధన్‌రూరల్(బోధన్): బోధన్ నియోజకవర్గంలో అన్నదాతలు వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభమవ్వడంతో రైతులు వానాకాలం పంటల సాగు పనులు మొదలుపెట్టారు. నియోజకవర్గంలోని బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లో రైతులు పొలాల్లో గట్లు సరిచేసుకోవడం, దుక్కులు దున్నడం, గొర్రెలు, పశువుల పేడను (సేంద్రియ ఎరువులు) జల్లుకోవడం, నారు మడులు సిద్ధం వంటి పనులతో సాగు కోసం పొలాలను సిద్ధం చేస్తున్నారు. రోహిణి కార్తెలో నారు మడులు దున్నితే పంటల దిగుబడి అధికంగా వస్తుందని రైతుల నమ్మకం. దీంతో ప్రస్తుతం రైతులు దుక్కులు దున్నుతున్నారు. తొలకరి జల్లులు కురవగానే నారు పోసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న అన్నదాతలు ప్రస్తుతం విత్తనాలు, ఎరువుమందుల సేకరణలో నిమగ్నమయ్యారు.

వరి పంటపై ఆసక్తి

నియోజకవర్గంలో రైతులు అత్యధికంగా వరి పంట సాగుపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లోని బోరు బావులు, కాలువలు, చెరువుల ద్వారా సాగునీరు సౌలభ్యం ఉండటంతో అన్నదాతలు వరి పంట సాగుపై దృష్టి సారిస్తున్నారు. నియోజకవర్గంలో లక్ష 10 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ సాగు భూమి ఉండగా వానాకాలం సీజన్‌లో లక్ష 7 వేల ఎకరాలకు పైగా రైతులు పంటలను సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా వరి 86,139 ఎకరాల్లో, సోయా 20,090 ఎకరాల్లో, కందులు 703 ఎకరాల్లో, పత్తి 469 ఎకరాల్లో, మినుములు, పెసర్లు, మొక్కజొన్న పంటలు 200 ఎకరాల్లో సాగు అయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

మరో 2 నుంచి 3 వేల ఎకరాల్లో పామాయిల్, ఉద్యానవన పంటలు, కూరగాయలు, ఇతర పంటలను సైతం రైతులు సాగు చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో యూరియా 18,065 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5,597 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 7,738 మెట్రిక్ టన్నులు, పొటాష్ 2,632 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 2,080 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖాధికారులు గుర్తించారు. రైతుల సాగు అవసరం మేరకు ఎరువు మందులు అందుబాటులో ఉంచుతామని బోధన్ ఇన్‌చార్జి ఏడీఏ సంతోష్ తెలిపారు.

పెరిగిన కౌలు ధరలు..

ఈ ఏడాది కౌలు ధరలకు రెక్కలు వచ్చాయి. గతే ఏడాది ఎకరాకు రూ20 వేల నుండి 25 వేల వరకు కౌలు ధర ఉండగా ఈ ఏడాది రూ.25 వేల నుంచి 30వేల వరకు కౌలు ధరలు పెరిగాయి. ఈ వానాకాలం సీజన్‌లో వాతావరణం అనుకూలంగా ఉంటుందని, అనుకున్న మేరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో కౌలు ధరలు పెరిగాయి. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు తమ సలహాలు, సూచనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రకృతి అనుకూలించాలని కోరుకుంటున్నాం



రోహిణి కార్తె ప్రారంభమవ్వడంతో వానాకాలం పంటల సాగు పనులు ప్రారంభించాం. పొలాల్లో గట్లు సరిచేసుకుని దుక్కులు దున్ని వారి నారు వేసేందుకు సిద్ధమవుతున్నాం. ప్రకతి అనూకూలించి పంటలు బాగా పంటలని కోరుకుంటున్నాం. అధికారులు అవసరం మేరకు విత్తనాలు, ఎరువు మందులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నాం.

– కోట రాంగోపాల్ రెడ్డి, రైతు, భూలక్ష్మిక్యాంపు

సలహాలు కచ్చితంగా పాటించాలి



నియోజకవర్గంలో వానాకాలం పంటల సాగు పనులు ప్రారంభమయ్యాయి. జూన్ మొదటి వారంలోపు రైతులు వరి నారు వేసుకోవాలి. రైతులు ముందస్తుగా సాగు పనులు ప్రారంభించడం ద్వారా వరి కోతలు సమయంలో అకాల వర్షాల ఇబ్బంది తప్పుతుంది. అవసరం మేరకు విత్తనాలు, ఎరువులు మందులు అందుబాటులో ఉంచుతాం. రైతులు పంటల సాగులో స్థానిక ఏఈవోల సహకారం తీసుకోవాలి.

– సంతోష్, ఇన్‌చార్జి ఏడీఏ, బోధన్

శరవేగంగా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు



కొనసాగుతున్న సబ్ స్టేషన్ పనులు

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 2021లో సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం శంకు స్థాపన చేయగా.. గత రెండు నెలల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి. సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పనులు వేగంగా చేపట్టారు. ప్రస్తుతం సివిల్స్ పనులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు పూర్తి చేశారు. మెకానికల్ పనులు ప్రారంభించి వేగవంతం చేస్తే వర్షకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

తీరనున్న లోవోల్టేజీ సమస్య..

ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామానికి ముప్కాల్ మండల కేంద్రం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్తు సరఫరా జరుగుతుంది. మండల కేంద్రం పెద్ద గ్రామం కావడంతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో నల్లూర్ గ్రామానికి లో–వోల్టేజీ సమస్య తలెత్తేది. కానీ ప్రస్తుతం విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే లోవోల్టేజీ సమస్య తీరుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెకానికల్ పనులు కూడ వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

‘బైపాస్’తో తీరనున్న కష్టాలు



వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామంలో నిర్మించిన బైపాస్‌రోడ్డుతో గ్రామస్తులకు రహదారి కష్టాలు తీరనున్నాయి. సుమారు 1.03 కిలోమీటర్లుగా ఉన్న బైపాస్‌రోడ్డుకు గతంలో రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ. కోటిన్నర నిధులు మంజూరు చేశారు. బైపాస్‌రోడ్డు నిర్మిస్తే రద్దీ బాగా తగ్గి రహదారి కష్టాలు తీరుతాయని గ్రామస్తులు మంత్రికి విన్నవించగా ఆయన నిధులు మంజూరు చేసి, పనులు పూర్తి చేయించారు. ప్రస్తుతం బైపాస్‌రోడ్డు అందుబాటులోకి రానుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

‘డబుల్‌బెడ్‌రూం ఇళ్ల దగాపై పోరుబాట’



మంగల్‌పాడ్ చౌరస్తాలో పోరుబాట ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఎడపల్లి(బోధన్): పేద ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకంతో మభ్యపెడుతుందని పేర్కొంటూ, బీజేపీ నాయకులు ‘డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకం దగాపై పోరుబాట’ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా సోమవారం వారు ఎడపల్లిలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ ఆకుల శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పథకం విషయంలో ప్రజల్ని దగా చేస్తూ, ఇప్పుడు ఆ పథకానికే ‘గృహలక్ష్మి’ అని పేరు పెట్టి మరోసారి ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. ఇల్లు కట్టుకున్నా వారికి రూ. 3లక్షలు ఇవ్వాలని, ఇళ్లు కట్టుకునే వారికి విడతల వారీగా ఆర్థికసాయం అందించాలన్నారు. లేనియెడల ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు కురెల శ్రీధర్, మోపాల కమలాకర్‌రెడ్డి, సర్పంచులు ఇంద్రకరణ్, హనుమండ్లు పాల్గొన్నారు.

టీచర్స్, లెక్చరర్స్ పోస్టులు భర్తీ చేయండి



బోధన్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్స్, లెక్చరర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీవీఎస్ (భారతీయ విద్యార్థి సేన) జిల్లా కో–కన్వీనర్ లోకేష్ గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మౌళిక సౌకర్యాలు కల్పించాలని, బోధన్ మండలంలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు లింగం, యోగేష్, సిద్ధు, ప్రవీణ్, రామక్రిష్ణ, వినోద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అన్ని సౌకర్యాలు



పెర్కిట్(ఆర్మూర్): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అధ్యాపకులు పేర్కొన్నారు. ఆర్మూర్ మండలంలోని మగ్గిడి, ఖానాపూర్ గ్రామాల్లో సోమవారం వారు కళాశాలలో ప్రవేశాల కోసం ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపల్ సీహెచ్ నర్సయ్య, చంద్రశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఆర్మూర్: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దాసు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు ఆర్మూర్, జక్రాన్‌పల్లి మండలాల ఎంపీడీవోలకు గ్రామ పంచాయతీ కార్మికుల పక్షాన వినతిపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రానిపక్షంలో వచ్చే నెల 12నుంచి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నాయకులు పొప్పరి గంగాధర్, గోపి, శేఖర్, లక్ష్మన్న, రాజన్న ఉన్నారు.

సంక్షిప్తం

లక్ష్మాపూర్‌లో బోరు డ్రిల్లింగ్

రుద్రూర్: చందూర్ వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని లక్ష్మాపూర్‌లో ఉప కార్యాలయం నిర్మాణానికి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో బాగంగా సోమవారం బోరు డ్రిల్లింగ్‌ను సంఘ అధ్యక్షుడు ప్యారం అశోక్ ప్రారంభించారు.

ఎల్లమ్మ ఆలయానికి విరాళం



నవీపేట(బోధన్): నవీపేట్‌లో నిర్మించిన రేణుక ఎల్లమ్మతల్లి దేవాలయానికి ఎమ్మెల్యే షకీల్ రూ. 25,000ల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు పంపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ్ సోమవారం ఆలయక కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. నాయకులు తెడ్డు పోశెట్టి, సూరి బాబు, అల్లం రమేష్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ



వర్ని: మండలంలోని అంతాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి భూమిచేశారు. అలాగే సేవాలాల్ మహారాజ్‌దిరానికి ప్రహరీనిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్పంచ్ పద్మ జగ్‌రాం, వర్ని సొసైటీ ప్రతినిధులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన ముండ్ల శంకర్ గత వారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి సోమవారం ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి రూ. పది వేల ఆర్థికసాయం అందజేశారు.

యూనియన్ నాయకుడికి సన్మానం

వేల్పూర్: దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీగా వేల్పూర్ మండలం జాన్కంపేట్‌కు చెందిన తలారి సంజీవయ్య ఇటీవల ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సోమవారం సంజీవయ్యతోపాటు కార్యవర్గ సభ్యులను సికింద్రాబాద్‌లో యూనియన్ తరపున సన్మానించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు హైదారాబాద్‌లో జరిగే సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం జరిగే రాష్ట్రస్థాయి పోటీలో క్రీడాకారులు అఖిల, మనోజ్ఞ, నవిత, నవ్యశ్రీలు పాల్గొననున్నారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లిలోగల వంజరిసంఘం భవనంలో మంగళవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సతీసమేతంగా హాజరు కావాలని జీవన్‌రెడ్డి కోరారు. సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి




కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న అధికారులు.. మెండోరా మండల కేంద్రంలో..

కమ్మర్‌పల్లి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో సోమవారం ఉత్సవాలపై మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 2నుంచి 22వరకు ఉత్సవాల కార్యక్రమాల సరళి ప్రకారం నిర్వహించాలన్నారు.

బాల్కొండ: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మెండోరా ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సతీష్‌రెడ్డిలు అన్నారు. మెండోరాలోని రైతు వేదికలో సోమవారం మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. జూన్ 2నుంచి చేపట్టే ఉత్సవాలపై నిర్లక్ష్యం వహించవద్దన్నారు. జెడ్పీటీసీ గంగాధర్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ పాల్గొన్నారు.

ఇలా వచ్చి.. అలా ముగించేశారు..

- బాల్కొండలో మండల సర్వసభ్య సమావేశం
- ప్రజా సమస్యలను చర్చించకుండానే ముగించిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

బాల్కొండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ యామగంటి లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని ఇలా వచ్చి.. అలా ముగించేశారు. సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా సభ్యులు, అధికారులు ఆలస్యంగా రావడంతో 11.50కు ప్రారంభమైంది. అనంతరం సమావేశాన్ని ఒంటి గంటకు ముగించారు. సమావేశంలో ఎంఈవో రాజేశ్వర్ మాట్లాడుతు.. మన ఊరు– మన బడిలో జలాల్‌పూర్, నాగాపూర్ గ్రామాల్లో పాఠశాలలు సిద్ధమయ్యాయని తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఏబీ నగర్‌లో సీసీరోడ్డు మధ్యలోఉన్న స్తంభాన్ని తొలగించాలంటే ట్రాన్స్‌కోకు జీపీ డీడీ చెల్లిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అంతే సమావేశం ముగిసింది. ప్రజ సమస్యలు చర్చకు రాకుండనే సమావేశాన్ని ముగించారు. ఎంపీపీ రెండు నిమిషాలు మాట్లాడుతూ.. వర్షాకాలంలో పారిశుధ్య లోపం లేకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండ చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ వినోద్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత కుటుంబ భ్యులు శివాలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అలాగే రామాలయం, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నప్రసాదంను భక్తులు స్వీకరించారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ మహాలక్ష్మీ దేవి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం గణపతి పూజ, గోపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహంతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేటి నుంచి త్రిశక్తి ఆలయ పున: ప్రతిష్ఠాపన

బోధన్: పట్టణంలోని శక్కర్‌నగర్ ప్రాంతంలోగల త్రిశక్తి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని నర్సాపూర్ దివ్య సంజీవని హనుమాన్ ఆశ్రమ వ్యవస్థాపకులు రామదాసీ సురేష్ ఆత్మారాం మహారాజ్ చేపట్టారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. మంగళవారం నుంచి ఆలయ ప్రారంభం, అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈసందర్భంగా సోమవారం త్రిశక్తి ఆలయాన్ని సురేష్ ఆత్మారాం కాలనీవాసులతో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.



ఆర్మూర్ పోలీస్ స్టేషన్ వద్ద వీవోఏలు



ముప్కాల్‌లో నిరసన తెలుపుతున్న వీవోఏలు

వీవోఏల ముందస్తు అరెస్టు

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన వీవోఏల ర్యాలీలో జిల్లాలోని వీవోఏలు పాల్గొనకుండా సోమవారం పలు ప్రాంతాల్లో పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేశారు. ఆర్మూర్, ముప్కాల్ సహా పలు మండలాల్లో పోలీసులు వీవోఏలను అరెస్టు చేసి, స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈసందర్భంగా పలువురు వీవోఏలు మాట్లాడుతూ.. ప్రశాంతంగా నిర్వహించే ర్యాలీలో పాల్గొనేందుకు తమను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదన్నారు. అరెస్టులతో తమ సమ్మెను అడ్డుకోలేరని, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు.

36వ రోజుకు చేరిన సమ్మె

బాల్కొండ: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ.. ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవదిక సమ్మె సోమవారం 36వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం స్పందించి వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని వీవోఏలు డిమాండ్ చేశారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	ఫాస్ట్ ఎక్స్ (తెలుగు) 10.30, 4.10, 7.10 గ్రే: ది స్పై హు లవ్డ్ మీ (తెలుగు) 1.30 2018 (తెలుగు) – 10.10 (రాత్రి)
స్క్రీన్-2 –	బిచ్చగాడు2 – 12.15, 3.30, 6.45, 10.00
స్క్రీన్-3 –	మేమ్ ఫేమస్ – 10.30, 4.30, 10.30 మళ్లీ పెళ్లి – 1.40, 7.40
స్క్రీన్-4 –	మెన్‌టూ (తెలుగు) – 12.20, 9.15 2018 (తెలుగు) – 3.05 ది కేరళ స్టోరీ (తెలుగు) – 6.15

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంయాడ్ : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899